టీచర్ల ఆధిపత్య పోరుతోనే సమస్యలు

గురుకుల ప్రిన్సిపాళ్ల శిక్షణలో మంత్రి సీతక్క వ్యాఖ్యలు

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల్లో ఈర్ష్య, అసూయ పెరుగుతున్నాయని స్త్రీ,శిశు సంక్షేమశాఖమంత్రి సీతక్క తెలిపారు. ఉపాధ్యాయుల మధ్య ఆధిపత్యపోరుతో గురుకుల హాస్టళ్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. గురువారం హైదరాబాద్ సరూర్‌నగర్‌లో గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయుల శిక్షణలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులంతా ఒకే కుటుంబంలా ఉంటే సమస్యలు రావని చెప్పారు. ఉపాధ్యాయులతో విద్యార్థుల కాళ్లు మొక్కించడం వంటి ఘటనలకు కొన్ని దుష్టశక్తులే కారణమని విమర్శించారు. శిక్షణ కార్యక్రమంలో సాంఘిక సంక్షే మ గురుకుల విద్యాలయాల కార్యదర్శి వర్షిణి, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో మాలల ఆధిపత్యం

- ఇంటికో డప్పుతో లక్ష డప్పుల మోతకు కదిలిరావాలి..
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

వైరాటౌన్, జనవరి 16 : కాంగ్రెస్‌లో మాలల ఆధిపత్యం నడుస్తున్నదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణపై ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే 'వెయ్యి గొంతులు-లక్ష డప్పుల' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఖమ్మం జిల్లా ఏన్కూరులో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1, 2024న ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణను పంజాబ్, తమిళనాడు, హర్యాన తదితర రాష్ట్రాల్లో అమలు చేసినప్పటికీ తెలంగాణలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. దీనికి కాంగ్రెస్ పార్టీలోని మాల నాయకులే కారణమని ఆరోపించారు.

ట్రిపుల్ ఆర్ సౌత్‌పై గందరగోళం!

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై ఎన్‌హెచ్‌ఏఐ విస్మయం
- వికసిత్ భారత్‌లో చేపడతామని చెప్పిన కేంద్రం
- అయినా డీపీఆర్ పేరుతో రాష్ట్ర సర్కారు హడావుడి

హైదరాబాద్, జనవరి 16(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ వైఖరితో ప్రాంతీయ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం వ్యవహారం గందరగోళంగా మారింది. వికసిత్ భారత్-2047 కార్యక్రమంలో భాగంగా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో చేపట్టనున్నట్టు కేంద్రం ఇదివరకే ప్రకటించింది. అయినా దీనిపై డీఆర్ఎస్ తయారీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చేస్తున్నది. తాము చేపట్టే ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ ఎందుకు తయారు చేయిస్తున్నదని ఎన్‌హెచ్ ఏఐ అధికారులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ట్రిపుల్ ఆర్‌కు అంకురార్పణ జరగ్గా, అప్పటి కేసీఆర్ సర్కారు విజ్ఞప్తిమేరకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఇందులో భాగంగా సంగారెడ్డి నుంచి నర్సాపూర్, మాసాయిపేట్, తూప్రాన్, గజ్వేల్, ప్రజ్ఞాపూర్, యాదాద్రి, వలిగొండ మీదుగా చౌటుప్పల్ వరకు 158.65 కిలోమీటర్ల మేర ఉత్తర భాగం, చౌటుప్పల్ నుంచి సంస్థాన్ నారాయణపూర్, చండూరు, మర్రిగూడ, ఆమన్‌గల్లు, కేశంపేట్, షాద్‌నగర్, షాబాద్, చేవెళ్ల, నవాబ్‌పేట మీదుగా సంగారెడ్డి వరకు 189 కిలోమీటర్ల మేర దక్షిణ భాగాన్ని నిర్మించాలని గతంలో ప్రణాళికలు సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించారు. రోడ్డును ఉత్తర, దక్షిణ భాగాలుగా కేంద్రం విభజించింది. ట్రాఫిక్ అధ్యయనం ప్రకారం దక్షిణ భాగానికి ఇప్పుడే తొందరేమీ లేదని నిర్ణయించి ఉత్తర భాగం పనులను 'భారత్ మాల' కార్యక్రమంలో మంజూరు చేసింది. భూసేకరణలో సమస్యల కారణంగా ఇంతకాలం జాప్యం జరగ్గా, ఇటీవలే ఉత్తర భాగం పనులను ఐదు ప్యాకేజీలుగా విభజించి టెండర్లను ఆహ్వానించారు. డీపీఆర్ రూపకల్పన సందర్భంగా ఉత్తర భాగం పొడవు 158.65 నుంచి 161.5కి పెరిగింది. ఉత్తర భాగం పనులతోపాటే దక్షిణ భాగం పనులను కూడా పూర్తిచేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం విజ్ఞప్తి చేయగా, వికసిత్ భారత్-2047లో చేపడతామని కేంద్రం ఆనాడే హామీ ఇచ్చింది.

పనులపై ద్వంద్వ వైఖరి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక దక్షిణ భాగం పనులను తామే చేపడతామని ప్రకటించింది. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో అధికారుల కమిటీని ఏర్పాటుచేయడమే కాకుండా కన్సల్టెంటు ద్వారా మరో అలైన్‌మెంట్‌ను రూపొందించింది. కొత్త అలైన్‌మెంటు ప్రకారం పొడవు 189 కిలోమీటర్ల నుంచి 195కి పెరిగింది. ఈ అలైన్‌మెంట్ ప్రకారం రహదారి నిర్మాణంపై సీఎం అధ్యక్షతన పలుమార్లు సమావేశాలు కూడా నిర్వహించారు. రహదారి వెళ్తున్న ప్రాంతాల్లో వివిధ శాఖల అధికారులతో సామాజిక ఆర్థిక సర్వేను కూడా నిర్వహించారు. భూసేకరణ సహా రహదారి నిర్మాణానికి దాదాపు రూ.20 వేల కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనాలను రూపొందించారు. ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో రహదారిని నిర్మిస్తే.. భూసేకరణ ఖర్చులో రాష్ట్ర ప్రభుత్వం సగం భరిస్తే సరిపోతుంది. రహదారి నిర్మాణం పూర్తిగా కేంద్రం ఆధ్వర్యంలోనే నిర్మిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మిస్తే ఖర్చు మొత్తం రాష్ట్రమే భరించాల్సి ఉంటుంది. దీంతో రాష్ట్ర సర్కారు ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం నిర్మించాలనే ఆలోచనను విరమించుకున్నది. అంతేకాదు, దక్షిణ భాగం పనులు త్వరలో చేపట్టాలని కేంద్రానికి లేఖ రాసింది.

డీపీఆర్ రూపకల్పన ఎందుకో?

త్వరగా దక్షిణభాగం పనులు చేపట్టాలని కోరుతున్న రాష్ట్రం.. ఇదే దక్షిణ భాగం కోసం డీపీఆర్ రూపకల్పనకు టెండర్లను ఆహ్వానించడంపై గందరగోళం నెలకొన్నది. ఎన్‌హెచ్‌ఏఐ చేపట్టిన ప్రాజక్టు కోసం అలైన్‌మెంట్ నుంచి డీపీఆర్‌ల తయారీ, టెండర్ల ప్రక్రియను అంతా ఆ సంస్థయే చూసుకుంటుంది. డీపీఆర్ ఖరారయ్యాక రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏవైనా అభ్యంతరాలున్నా, మార్పులు, చేర్పులు ఉన్నా సూచించవచ్చు. ఇక్కడ ఏకంగా రాష్ట్ర ప్రభుత్వమే డీపీఆర్ రూపొందించడం వెనుక కారణం ఏమిటనేది ఎవరికీ అంతుబట్టడం లేదు. ఎన్‌హెచ్‌ఏఐ వద్ద మాత్రం ఇప్పటికీ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూపొందించిన ముసాయిదా అలైన్‌మెంట్ మాత్రమే ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మార్చిన అలైన్‌మెంట్ ఇంకా ఎన్‌హెచ్‌ఏఐకి చేరనేలేదు. రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ రూపొందిస్తున్న విషయం కూడా తమకు తెలియని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ డీపీఆర్‌ను ఎన్‌హెచ్‌ఏఐ ఏ మేరకు పరిగణనలోకి తీసుకుంటుందనేది కూడా తేలాల్సి ఉన్నది.

రామన్నపేటలో అంబుజా సిమెంట్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఆ పార్టీ నాయకులు

అదానీ సిమెంట్ పరిశ్రమను రద్దు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

రామన్నపేట, జనవరి16 : రామన్నపేటలో నిర్మించతలపెట్టిన అదానీ గ్రూప్ అంబుజా సిమెంట్ పరిశ్రమను రద్దు చేస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో అంబుజా సిమెంట్ ప్రతిపాదిత స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే అంబుజా సిమెంట్ పరిశ్రమను ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలంతా ముక్త కంఠంతో వ్యతిరేకించారని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ జరిగి నాలు గు నెలలు కావస్తున్నా రద్దు చేయడంలో ప్రభుత్వం ఎందుకు చోద్యం చేస్తుందో ప్రజలకు వివరించాలని చెప్పారు. రామన్నపేటను మరో లగచర్లగా మార్చొదని తెలిపారు.

ఈవీ బస్సులతో ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకం

కార్మిక సంఘాల నేతలు థామస్‌రెడ్డి, కే రాజిరెడ్డి

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్తు బస్సులతో ఆర్టీసీలో డ్రైవర్, మెకానిక్, శ్రామికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని టీఎంయూ ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి, టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రాజిరెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం విద్యుత్తు బస్సులను తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నామని.. కానీ, వాటి తయారీ, నిర్వహణను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్తు బస్సుల కోసం కోట్లాది రూపాయల ప్రజల డబ్బులను సబ్సిడీల పేరిట పెట్టుబడిదారులకు కట్టపెడుతున్నారని విమర్శించారు. విద్యుత్తు బస్సుల పథకానికి కేటాయించిన డబ్బులతో ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసి దామాషా పద్ధతిలో రాష్ట్రాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకం ద్వారా ఆర్టీసీలకు బస్సులను గ్రాంట్‌గా ఇచ్చిన మాదిరిగానే విద్యుత్తు బస్సులను కూడా ఇవ్వాలని పేర్కొన్నారు. విద్యుత్తు బస్సుల పథకంలో మార్పులు చేస్తూ ఆర్టీసీ యాజమాన్యాలే నేరుగా బస్సులను కొనుగోలు చేసి నిర్వహించుకునేలా కొత్త పాలసీ తీసుకురావాలని థామస్‌రెడ్డి, రాజిరెడ్డి డిమాండ్ చేశారు.

పూజారుల సమస్యలు పరిష్కరించాలి

- టీటీడీ నుంచి రాష్ట్రవాటా రూ.28 కోట్లు తేవాలి
- ఫెడరేషన్ ఆఫ్ బ్రాహ్మిణ్ అసోసియేషన్ డిమాండ్

రామంతాపూర్, జనవరి 16: రాష్ట్రంలో ధూపదీప నైవేద్యాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని ఫెడరేషన్ ఆఫ్ బ్రాహ్మిణ్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. పూజారుల సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఒగిరాల రమేశ్, ప్రధాన కార్యదర్శి గంగు నర్సింహమూర్తి, కార్యదర్శి భాస్కరభట్ల రామశర్మ దేవాదాయ కమిషనర్ శ్రీధర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ధూపదీప నైవేద్యం కింద పూజారులకు రూ.20 వేలు పెంచాలని, జీత భత్యాలు, పెన్షన్ ఇత్యాది ఇతర ఉద్యోగులకు ఇస్తున్నట్టుగా అర్చకులకు సమానంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేవాదాయ భూములను ఇతర కార్యక్రమాలకు కేటాయించొద్దని పేర్కొన్నారు. ఏపీలోగా మాదిరిగా అనువంశిక అర్చకత్వాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలని తెలిపారు. అర్చకులపై దేవాదాయ ఉద్యోగుల అజమాయిషీని రూపుమాపాలని పేర్కొన్నారు. టీటీడీ నుంచి తెలంగాణ వాటా రూ. 28 కోట్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

తెలంగాణలో గ్యారెంటీలు అమలు చేశాం

- హామీ మేరకు రుణమాఫీ పూర్తిచేశాం
- ఢిల్లీలోనూ హామీలు అమలు చేస్తాం : ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్, జనవరి 16(నమస్తే తెలంగాణ): ఓవైపు తెలంగాణలో కాంగ్రెస్ గ్యారెంటీలను అమలు చేయాలని ప్రజలు రోడ్డెక్కుతుంటే.. మరోవైపు రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను అమలు చేశామని, ఢిల్లీలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అక్కడా హామీలు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో మాట్లాడిన ఆయన ఢిల్లీ ప్రజలకు రెండు గ్యారెంటీలు ఇచ్చారు. ఢిల్లీలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తామని, రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో విజయవంతంగా హామీలు అమలు చేశామని, ఇప్పుడు ఢిల్లీలోనూ అలాంటి హామీలే ఇస్తున్నట్టు తెలిపారు. దేశంలో మరెక్కడా లేని విధంగా రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్టు తెలిపారు. ఢిల్లీలో అడుగుపెట్టాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందని, ఇటు సీఎంగా కేజ్రీవాల్, అటు పీఎంగా మోడీ ఢిల్లీకి చేసిందేమీ లేదని దుయ్యబట్టారు.

కేంద్రానికి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తులు

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): కేంద్ర అటవీశాఖ అనుమతులు రాక పోవడంతో తెలంగాణలో నిలిచిన 161 ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయాలని సీఎం రేవంత్ కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్‌ను కోరారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో భూపేందర్‌తో రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. కేంద్ర భారీపరిశ్రమలశాఖ మంత్రి డీ కుమారస్వామితో సమావేశమైన సీఎం హైదరాబాద్‌లో 100 శాతం బస్సులను ఎలక్ట్రిక్ మోడల్‌లోకి మార్చేందుకు సహకరించాలని కోరారు. ఉక్కుశాఖ సహాయమంత్రి శ్రీనివాస వర్మతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఢిల్లీ పర్యటన ముగించుకున్న రేవంత్‌రెడ్డి అక్కడి నుంచి విదేశాలకు పయనమయ్యారు. సింగపూర్, దుబాయిలో పర్యటించిన తర్వాత దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సమాఖ్య సదస్సులో పాల్గొంటారు.

317 జీవో ఉద్యోగుల బదిలీలు ప్రారంభం

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): జీవో 317తో ప్రభావితులైన ఉద్యోగుల బదిలీలు ప్రారంభమయ్యాయి. ఇటీవలే రెవెన్యూ శాఖలో వివిధ జోన్ల మధ్య ఉద్యోగులను బదిలీ చేశారు. ఆఫీస్ సబార్డినేట్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, నాయబ్ తహసీల్దార్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. క్యాబినెట్ సబ్ కమిటీ ఆదేశాల మేరకు మెడికల్, స్పౌజ్, మ్యూచువల్ బదిలీలు చేపట్టారు. శాఖలవారీగా ఉత్తర్వులు విడుదల చేస్తారని సచివాలయ వర్గాలు తెలిపాయి.

చిట్టడవికి పునరావాస ముప్పు

- బాచారంలో కాలనీల ఏర్పాటుకు 1500 హెక్టార్ల గుర్తింపు
- లక్ష చెట్ల తొలగింపునకు కేంద్రం అనుమతి కోరిన అటవీశాఖ
- చెట్ల తొలగింపుపై పర్యావరణ, సామాజిక వేత్తల అభ్యంతరం

హైదరాబాద్, జనవరి 16 (నమస్తేతెలంగాణ): టెరిటోరియల్ అడివిని నరికి టైగర్ రిజర్వ్ ఫారెస్టు బాధితులకు పునరావాసం కల్పించాలని రాష్ట్ర అటవీశాఖ నిర్ణయించింది. ఈ మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలంలోని బాచారం టెరిటోరియల్ అడవిని డీనోటిఫై చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. సుమారు 1500 హెక్టార్లలో ఉన్న తుప్పలు, పొదలు, చెట్లను తొలగించి, భూమిని సాగుయోగ్యంగా మార్చేందుకు అనుమతించాలని అటవీశాఖ అధికారులు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరోవైపు చెట్ల తొలగింపుపై పర్యావరణ, సామాజికవేత్తలు అభ్యంతరం చెప్తున్నారు.

రెండుదశల్లో తరలింపు

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కోర్ ఏరియా నుంచి 1,253 కుటుంబాలను రెండు దశల్లో తరలించేందుకు అటవీశాఖ ఏర్పాట్లు చేసింది. మొదటి దశలో సార్లపల్లి, కుడిచింతలబైలు, కొల్లంపెంట, తాటిగండ్ల గ్రామాల నుంచి 417 మంది చెంచేతర కుటుంబాలను పెద్దకొత్తపల్లి మండలం బచారం టెరిటోరియల్ రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాకు తరలిచేందుకు ప్రయత్నం చేస్తున్నారు. రెండో దశలో 836 కుటుంబాలను చెంచు కుటుంబాలను ఇతర ప్రాంతాలకు తరలించే ప్రణాళిక రూపొందించారు. మొదటి దశ తరలింపు కోసం రూ.55 కోట్లు, రెండో దశ తరలింపు కోసం రూ.100 కోట్లు ఖర్చవుతాయని అటవీశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధంచేశారు.

కేంద్రం అనుమతిస్తేనే ముందుకు!

టైగర్ రిజర్వ్ ఏరియా నుంచి బయటికి వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్న 417 కుటుంబాలు వ్యవసాయ భూములు కావాలని డిమాండ్ చేస్తున్నాయి. కానీ ఇన్ని కుటుంబాలకు కావాల్సిన భూమి రెవెన్యూశాఖ నుంచి లభ్యం కావటంలేదు. పులి సంచారం లేని, తుప్పలు, పొదలతో నిండిన టెరిటోరియల్ ఫారెస్టు భూమినే బాధితులకు ఇవ్వాలని అటవీశాఖ నిర్ణయించింది. బాచారం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో 1500 హెక్టార్ల భూమిని గుర్తించింది. రిజర్వ్ ఫారెస్ట్ భూములను డీనోటిఫై చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. భూమిని సాగుయోగ్యంగా మార్చేందుకు సుమారు 1.3 లక్షల తుప్పలు, పొదలు, చెట్లు తొలగించాలని, పులి సంచారం లేని ప్రాంతం కాబట్టి వాటి తొలగింపునకు అనుమతివ్వాలని కోరింది. ఈ ప్రతిపాదనలపై కేంద్ర అటవీశాఖ నిర్ణయం వెల్లడించాల్సి ఉంది.

రాష్ట్ర కమిటీ ఆమోదం

గ్రామాల తరలింపు, పునరావాసంపై అటవీశాఖ అధికారులు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశాలను నిర్వహించారు. రాష్ట్ర కమిటీ కూడా ఆమోదించింది. ఏటీఆర్‌లో పులుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నందున, ప్రధాన ప్రాంతాల నుంచి గ్రామాల తరలింపు అనివార్యంగా మారిందని అధికారులు చెప్తున్నారు. మానవ-వన్యప్రాణుల సంఘర్షణ, జీవవైవిధ్యం అభివృద్ధి, స్థానిక నివాసితుల సంక్షేమం దృష్ట్యా తరలింపు చేపడుతున్నట్టు ప్రభుత్వం తెలిపింది. అడవిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న చెంచులను అక్కడి నుంచి బలవంతంగా తరలిస్తే వారి జీవనం దెబ్బతింటుందని పలువురు సామాజిక వేత్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

పులులకు, చెంచులకు మధ్య వైరమే లేదు

పులులకు, చెంచులకు మధ్య వైరమే లేదు. అడవి, చెంచులు వేర్వేరు కాదు. చెంచుల ఆవాసమే నల్లమల అడవి. తల్లి తావు నుంచి గిరిజనులను వేరు చేయవద్దు. భూగర్భ వనరులను వెలికితీసే కుట్రలతో పాలకులు చెంచులను అడవికి దూరం చేస్తున్నారు. నల్లమలలో యురేనియం నిక్షేపాలను వెలికి తీయవద్దని గతంలోనే కేసీఆర్ ప్రభుత్వం తీర్మానం చేసి, కేంద్రానికి పంపింది.

– గోరటి వెంకన్న, ప్రజాకవి, ఎమ్మెల్సీ

చెట్ల తొలగింపు.. పర్యావరణానికి ముప్పు

బాచారంలో పునరావాస కాలనీల ఏర్పాటు పేరుతో లక్ష చెట్లను తొలగించడం పర్యావరణానికి ప్రమాదకరంగా మారుతుంది. ఇష్టానుసారంగా చెట్లను తొలగించడంతో ములుగులో లక్ష చెట్లు నేలమట్టమయ్యాయి. అమ్రాబాద్ రిజర్వ్ ఫారెస్ట్‌ను టైగర్ కారిడార్ పేరుతో చెంచులను తరలించడం కన్నా ప్రస్తుతం ఉన్న కారిడార్‌ను కాపాడితే సరిపోతుంది.

– ప్రొఫెసర్ తిరుపతిరావు, ఓయూ మాజీ వీసీ, పర్యావరణ నిపుణుడు

అమ్మకానికి సర్కారు భూములు

- 3,500 కోట్ల సమీకరణకు సిద్ధం
- వేలంలో స్థలాలు, ఫ్లాట్ల విక్రయం
- వచ్చే నెలలోనే వేలం నోటిఫికేషన్
- ఆర్థికలోటును పూడ్చుకొనే యత్నం

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): అడ్డగోలుగా ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ఆపసోపాలు పడుతున్న రేవంత్‌రెడ్డి సర్కారు.. ఆర్థిక లోటును పూడ్చుకునేందుకు ప్రభుత్వ భూములను అమ్మకానికి పెడుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ పరిధిలోని ఇండ్ల స్థలాలు, అమ్ముడుపోని ఫ్లాట్లను వేలం వేస్తున్నది. తద్వారా రూ.3,500 కోట్లకు పైగా నిధుల సమీకరణకు సిద్ధమైంది. ఈ వేలాలకు సంబంధించిన నోటిఫికేషన్ వచ్చే నెలలో విడుదల కానున్నది. ఈ వేలం ద్వారా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలో మొత్తం 1,400కు పైగా ఓపెన్ ప్లాట్లు (100-500 చదరపు గజాల మధ్య), కరీంనగర్, ఖమ్మం, గద్వాల తదితరజిల్లాల్లో అమ్మకానికి సిద్ధం చేశారు. వీటితోపాటు ఇంకా పూర్తికాని 361 ఇండ్లు అమ్మకానికి పెట్టారు. పోచారం, బండ్లగూడ, నాగోల్ సమీపంలోని రాజీవ్ స్వగృహ గేటెడ్ టౌన్‌షిప్‌లు, జవహర్‌నగర్, గాజులరామారం తదితర ప్రాంతాల్లో ఇంకా అమ్ముడుపోని 700 ఫ్లాట్లను కాంగ్రెస్ సర్కారు అమ్మే ప్రయత్నం చేస్తున్నది. ఈ ఫ్లాట్లు 2007 నుంచి ఇప్పటి వరకు అమ్ముపోకుండా ఉన్నాయి. 54 కేపీ హెచ్‌బీ ఫ్లాట్లకు ఈ నెల 24న, గచ్చిబౌలి, బాలాజీనగర్, భరత్‌నగర్‌లోని ఏడు ఫ్లాట్లకు ఈ నెల 30న, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలోని 42 ఫ్లాట్లకు వచ్చే నెల 5న వేలం నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మిగతా వాటికి ఫిబ్రవరిలో, మార్చిలో వేలం వేయనున్నట్టు తెలిసింది.

ఆర్థికలోటును పూడ్చుకొనే యత్నం

ఆర్బీఐ నుంచి అప్పుచేసినా బండి నడవక పోవడంతో ఆర్థికలోటును ఎదుర్కోవడానికి ప్రభుత్వం ఇండ్లస్థలాలు, అమ్ముడుపోని ఫ్లాట్లను వేలం ద్వారా విక్రయిస్తున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నవంబర్ వరకు రాష్ట్ర ఆదాయం రూ.1.03 లక్షల కోట్లుగా ఉన్నది. నిరుడు ఇదే కాలంలో రూ.1.11 లక్షల కోట్లు వచ్చింది. నవంబర్ చివరి నాటికి మొత్తం ఆదాయం సుమారు రూ.1.41 లక్షల కోట్లు ఉండగా, వ్యయాలు రూ.1.38 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఈలోగా రూ.2,621 కోట్ల రుణాలు, చెల్లింపుల కోసం ఖర్చుచేశారు. దాంతో రాష్ట్రానికి రూ.14,288 కోట్ల ఆదాయ లోటు, రూ.37,850 కోట్ల ఆర్థిక లోటు ఏర్పడింది. ఈ లోటును స్థలాలు, ఫ్లాట్ల వేలం ద్వారా పూడ్చుకోవాలని భావిస్తున్నది.

చేర్యాలలో 'కోస్తా' మోసం!

- యాప్‌లో కోట్లల్లో పెట్టుబడులు
- 6 వేల మందికి పైగా బాధితులు
- మూడు రోజులుగా తెరుచుకోని యాప్
- విచారణ చేస్తున్న చేర్యాల పోలీసులు

కోస్తా యాప్‌లో కనిపిస్తున్న విదేశీయులు

చేర్యాల, జనవరి 16: సిద్దిపేట జిల్లా చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట, కొమురవెల్లి మండల కేంద్రాలతో పాటు పరిసర గ్రామాల్లో ఏనోట విన్నా 'కోస్తా' యాప్ గురించి జోరుగా చర్చ జరుగుతున్నది. 'నేను ఇంత పెట్టుబడి పెట్టా, నువ్వు ఎంత పెట్టావు?' అనే మాటలే వినిపిస్తున్నాయి. చేర్యాల ప్రాంతంలో ఈ యాప్‌లో సుమారు 6 వేల మంది రూ.కోట్లల్లో పెట్టుబడులు పెట్టారు. అయితే, మూడు రోజులుగా యాప్ ఓపెన్ కాకపోవడంతో వారంతా ఇప్పుడు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీంతో ఈ యాప్ వెనుక ఎవరున్నారనే కోణంలో పోలీసులు గురువారం విచారణ ప్రారంభించారు. పెట్టుబడి పెట్టి లాభాలు గడించిన పలువురిని విచారణకు రావాలని పోలీసులు ఫోన్లు చేసినట్టు సమాచారం.

ఇదీ కోస్తా బాగోతం

ఈ యాప్‌కు సంబంధించి కార్యాలయం లేదు.. ప్రతినిధులూ లేరు. కానీ, యాప్‌లో పెట్టుబడులు పెడితే వేలల్లో ఆదాయమంటూ ప్రచారం జోరందుకోవడంతో చాలామంది అమాయకులు పెట్టుబడి పెట్టారు. ఇందులో పెట్టుబడి పెట్టాలంటే మొదట రూ.590 చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రవేశ రుసుం రూ. 590 లను సైతం రోజుకు రూ.23 చొప్పున ఖాతాలో వేస్తుండటంతో నమ్మిన చాలా మంది లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టారు. పైగా ఆఫర్ పేరిట రూ.99 వేలకు బదులు రూ.69,900 చెల్లిస్తే చాలని యాప్‌లో ప్రకటించడంతో చాలామంది ఆకర్షితులయ్యారు.

రూ.3 కోట్లకు పైగా పెట్టుబడులు

ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి కొత్త సభ్యులను చేర్పించేవారికి టీవీ, బైక్, కార్లు లాంటి గిఫ్టులను ఇస్తున్నట్టు సమాచారం. దీంతో మొత్తం రూ.3 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టినట్టు తెలుస్తున్నది. మూడు రోజులు యాప్ ఓపెన్ కాకపోవడంతో ఇప్పుడు అందరూ లబోది